
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 సిద్దిపేట
బుధవారం 18 డిసెంబరు 2024


ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

తుది దశకు ధాన్యం కొనుగోళ్లు

- ఇప్పటి వరకు 56,750 మంది రైతుల నుంచి 2.49 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- ఈనెలాఖరుకు వరకు కొనుగోళ్లు పూర్తి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వానా కాలం సీజన్ వరిధాన్యం కొనుగోళ్లు చివరిదశకు చేరాయి. జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కోసం 419 కేంద్రాలను ప్రారంభించారు. అందులో 100 కేంద్రాలను ఇప్పటికే మూసేశారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 2,49,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 56,750 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ఈ ధాన్యం విలువ రూ.561.41 కోట్లు కాగా.. ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ.535.55 కోట్లు జమ చేశారు.

సన్నాల్ల కోసం 68 కొనుగోలు కేంద్రాలు

సన్నరకం వరిధాన్యం పండించిన రైతులకు ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్‌ను ప్రకటించింది. ప్రత్యేకంగా జిల్లాలో సన్నాలు కొనుగోలు చేసేందుకు 68 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటి వరకు రూ.18.94 కోట్లవిలువతో 6717.76 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.2.95 కోట్ల బోనస్‌ను సైతం రైతులకు అందించారు.

ఆలస్యంగా ప్రారంభం

ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 2.68 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దాదాపు 8 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. స్థానిక, రైతుల అవసరాలు పోగా, సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావొచ్చని అధికారులు భావించారు. ఇప్పటి వరకు 2.49 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించారు. వ్యవసాయశాఖ అంచనా వేసిన విధంగా దిగుబడి వచ్చినా ఆశించిన మేరకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాకపోవడానికి ఆలస్యంగా కొనుగోళ్లు ప్రారంభించడమే ప్రధాన కారణం. మిల్లర్లకు, ప్రభుత్వానికి ఒప్పందం కుదరడంలో ఆలస్యం జరిగిన కారణంగా సీజన్ మొదట్లో పంట సాగు చేసిన రైతులు ధాన్యాన్ని నిల్వ చేయడం ఇబ్బందిగా భావించి మిల్లర్లకు మద్దతు ధరకన్నా తక్కువకే విక్రయించుకోవాల్సి వచ్చింది.

దివ్యాంగుల సమస్యలపై సీఎం, మంత్రులతో చర్చిస్తా

- దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పిస్తాం
- ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుంది
- దివ్యాంగుల దినోత్సవంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి


దివ్యాంగుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ క్రాంతి వల్లూరు, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు

సంగారెడ్డి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖలో చర్చిస్తానని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి భరోసా కల్పించారు. ఇందిరమ్మ ఇండ్లతోపాటు టీజీఐఐసీ ద్వారా ఏర్పాటయ్యే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలలోనూ ప్రాధాన్యత దక్కేలా చూస్తామని చెప్పారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులను చిన్నచూపుతో చూడవద్దని, వారికి తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం దివ్యాంగుల క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి లలిత, జర్నలిస్టు షఫీ, జుబేదా తదితరులు ఉన్నారు.

ప్రాజెక్టు రద్దయి.. పదేళ్లు

అయినా ప్రభుత్వ ఆధీనంలోనే 1500 ఎకరాల భూములు

- గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన
- బీఆర్ఎస్ హయాంలో రద్దు
- భూములు తిరిగి ఇవ్వాలని రైతుల వేడుకోలు
- ప్రభుత్వ పథకాలు వర్తించక, బ్యాంకులు రుణాలు ఇవ్వక రైతుల అవస్థలు

హుస్నాబాద్ నియోజకవర్గంలోని భూములకు సాగునీరు అందించేందుకు 0.950 టీఎంసీల సామర్థ్యంతో తోటపల్లి రిజర్వాయర్ కోసం సేకరించిన 1600 ఎకరాల పైచిలుకు భూములపై ఇంకా సందిగ్ధం వీడడం లేదు. తోటపల్లి రిజర్వాయర్ రద్దయి పదేళ్లు అవుతున్నా.. ప్రభుత్వం ఈ భూములపై స్పష్టమైన నిర్ణయాన్ని ఇప్పటికీ తీసుకోలేదు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తోటపల్లి రిజర్వాయర్ కోసం శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడింది. ప్రాజెక్టుల రీడిజైన్‌లో భాగంగా ఈ ప్రాజెక్టును రద్దు చేసింది. రైతుబంధు, రైతుబీమా లేక భూములపై బ్యాంకులు రుణాలివ్వక ప్రాజెక్టు కోసం భూములను త్యాగం చేసిన రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ నావలా మారింది.

- బెజ్జంకి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి)


తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం గాగిల్లాపూర్ శివారులో ప్రభుత్వం సేకరించిన భూములు

బెజ్జంకి మండలంలో తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007 సెప్టెంబరు 9న శంకుస్థాపన చేశారు. 0.950 టీఎంసీల సామర్థ్యంతో 49వేల ఎకరాలకు సాగునీరు అందేలా ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. నిర్మాణం కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్, తోటపల్లి కోహెడ మండలంలోని రామచంద్రాపూర్, వరికోలు, నారాయణపూర్, చిగురుమామిడి మండలంలోని ఓబులాపూర్ గ్రామాల్లోని సుమారు 500 మంది రైతుల నుంచి 1600 ఎకరాల పైచిలుకు భూములను పలు దఫాలుగా ప్రభుత్వం సేకరించింది. రైతులకు అప్పటి మార్కెట్ ధర ప్రకారం రూ.2.10 లక్షల పరిహారం చెల్లించి భూములను సేకరించి రిజర్వాయర్ పనులను ప్రారంభించారు.

రీడిజైన్‌లో రద్దు..

0.950 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన తోటపల్లి రిజర్వాయర్‌లో బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్, కోహెడ మండలంలోని రామచంద్రాపూర్, వరికోలు, నారాయణపూర్, చిగురుమామిడి మండలంలోని ఓబులాపూర్ గ్రామాలు ముంపునకు లోనవుతున్నాయని భావించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై ఇంజనీరింగ్ అధికారులతో అధ్యయనం చేయించింది. తోటపల్లి రిజర్వాయర్ కేవలం 0.3 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉండేందుకు వీలుగా ఉందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. తక్కువ నీటి సామర్థ్యం ఉండడంతో బెజ్జంకి, కోహెడ, చిగురుమామిడి మండలాల్లోని గ్రామాలు ముంపునకు గురికాకుండా గాగిల్లాపూర్ మోయతుమ్మెద వాగుపై గ్రావిటీ కెనాల్ నిర్మించి హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. తోట

మిగతా 8వ పేజీలో...


జహీరాబాద్ వద్ద పొగమంచుతో మసకబారిని జాతీయ రహదారి

చలి వణికిస్తున్నది

ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

- సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 6.7
- సిద్దిపేట జిల్లా పోతారెడ్డిపేటలో 7.6
- మెదక్ జిల్లా కొత్తపేటలో 7.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు

ఉమ్మడి మెదక్ జిల్లాను చలి వణికిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పడిపోతుండగా.. వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఉత్తారాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావంతో జనం గజగజ వణికిపోతున్నారు.

మెదక్ అర్బన్/జహీరాబాద్/కోహీర్ డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గతంలో ఎన్నడూ లేనంతగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోతున్నాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మంచు కురుస్తోంది. మంగళవారం అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 6.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సిద్దిపేట జిల్లా పోతారెడ్డిపేటలో 7.6 డిగ్రీలు, మెదక్ జిల్లా కొత్తపేటలో 7.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణశాఖ ఉమ్మడి మెదక్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది

పల్లెలపై పంజా

చలి తీవ్రత పెరగడంతో పల్లె ప్రజలు వణికిపోతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచే చలి పంజా విసురుతోంది. చలితో ఆయా గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నెగళ్లు పెట్టుకుంటున్నారు. చలి నుంచి కాపాడుకోవడానికి గ్రామస్థులు మంటలు కాగుతున్నారు. ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లేవారు, వృద్ధులు, వ్యాధిగ్రస్థులు చలితీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. చలి గాలులకు పొగమంచు తోడవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఉదయం తొమ్మిదైనా ముసుగు తీయ డం లేదు.

వ్యాధుల విజృంభణ

వాతావరణంలో ఒక్కసారిగా చోటు చేసుకుంటున్న మార్పులతో అనేకమంది దగ్గు, జలుబు, ముక్కుదిబ్బడ, అస్తమాతో బాధపడుతున్నారు. చర్మం పొడిబారి పగుళ్ల ఏర్పడుతున్నాయి. సరిపడా నీరు

మిగతా 6వ పేజీలో

నారుకు చలి దెబ్బ 7

అసెంబ్లీలో చేర్యాలపై చర్చ

- రెవెన్యూ డివిజన్ చేయాలి : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- ముక్కలు, చెక్కలు చేసింది బీఆర్ఎస్సే : మంత్రి కోమటిరెడ్డి
- కలెక్టర్ పరిశీలనలో ఉంది.. సీఎం దృష్టికి తీసుకెళ్తా : రెవెన్యూ మంత్రి పొంగులేటి




చేర్యాల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశంపై తీవ్ర మంగళవారం తీవ్రచర్చ జరిగింది. క్వశ్చన్ అవర్స్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రెవెన్యూ డివిజన్ సమస్యను ప్రస్తావించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంతో పాటు అంతర్జాతీయ ఖ్యాతిగడించి రాష్ట్రానికి వన్నె తీసుకువచ్చిన నకాశీ చిత్రకళలు పురుడుపోసుకున్నాయని, రైతాంగ సాయుధ పోరాటానికి ప్రతీక అయిన బైరాన్‌పల్లి, కూటిగల్ అమరుల ప్రాణత్యాగాలకు నిలయమైన చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేయాలని కోరారు. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట మండలాల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల సేవల నిమిత్తం ఒక్కో డివిజన్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. చేర్యాలలో ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ ఆఫీస్‌తో పాటు మున్సిఫ్ కోర్టు మంజూరైందని పేర్కొన్నారు. తొలి అసెంబ్లీ సమావేశాల్లో తాను ప్రస్తావించడంతో పాటు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు గతంలో వినతిపత్రాలను అందించినట్లు చెప్పారు. డివిజన్ కోసం ఎంపీగా ఉన్న సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దీక్ష చేపట్టి జేఏసీకి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇటీవల ఏటూరునాగారాన్ని డివిజన్ చేశారని, ఇదే కోవలో చేర్యాలకు న్యాయం చేయాలని కోరారు. మంత్రి పొంగులేటి సూచనానుసారం ఇటీవల ఫీజిబులిటీ రిపోర్టు కోరినందున త్వరితగతిన ఆమోదం తెలిపి చేర్యాల ప్రజల కలను సాకారం చేయాలని కోరారు.

డివిజన్ చేయాల్సిందే
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చేర్యాలను ముక్కలు చెక్కలు చేసింది బీఆర్ఎస్సేనని, కొత్త డివిజన్లు, జిల్లాలు అశాస్త్రీయంగా జరిపారని ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ డివిజన్ విషయమై అసెంబ్లీలో మాట్లాడుతూ.. పోరాటాల గడ్డ చేర్యాల చరిత్ర ఎంతో గొప్పదని అన్నారు. ప్రజాసమస్యలు వేరని, రెవెన్యూ డివిజన్ న్యాయమైనదని, ఈవిషయమై రెవెన్యూ మంత్రి పొంగులేటి చొరవ వహించి న్యాయపర డిమాండ్ నేరవేర్చాలని కోరారు.

భేషజాలకు పోకుండా చర్యలు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయమై కలెక్టర్ పరిశీలనలో ఉందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సంబంధిత అధికారుల నుంచి ఫీజిబులిటీ నివేదిక తెప్పించుకుంటున్నామని, దాని ఆధారంగా భేషజాలకు వెళ్లకుండా డివిజన్లు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఒక నియోజకవర్గానికి చెందిన మండలాలు పలు జిల్లాలో ఉండటం బాధాకరమన్నారు. సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆయన సమాధానమిచ్చారు.

రెవెన్యూ డివిజన్ కోసం సుమారు పదేళ్లుగా ఆందోళనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో అసెంబ్లీలో తీవ్ర చర్చ జరగడం, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు గతంలో ఎంపీ పదవీకాలంలో నెలకొన్న అనుబంధంతో చొరవ వహించిన మంత్రి కోమటిరెడ్డి తీరుపై అనూహ్య స్పందన లభించింది. మంత్రి పొంగులేటి సానుకూల దృక్పథం కనబరచినప్పటికీ జిల్లా అధికారులు అందించే ఫీజిబులిటీ రిపోర్ట్‌పైనే సర్వత్రా ఆసక్తి నెలకొంది.


క్రీడాజ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బక్కివెంకటయ్య, అబ్దుల్ హమీద్


కబడ్డీలో పోటీ పడుతున్న క్రీడాకారులు

సందడిగా సీఎం కప్ క్రీడాపోటీలు

- 3 రోజులు, 28 యూనిట్ల క్రీడాజట్లు
- 18 క్రీడాంశాల్లో పోటీలు



సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి క్రీడా ప్రతిజ్ఞ చేశారు. అంతకు ముందు వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 24 మండలాలు, 4 మున్సిపాలిటీల నుంచి మొత్తం 28 యూనిట్ల క్రీడా జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. సుమారు 1500 మంది క్రీడాకారులు పోటీ పడనున్నారు. 120 మంది వ్యాయామ ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించనున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడోత్సవాల్లో 18 క్రీడాంశాలు నిర్వహించనున్నారు. విద్యా ర్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటుగా మానసిక చురుకుదనం కలిగిస్తాయన్నారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని, ఆటల్లో గెలుపుఓటములు ముఖ్యం కాదని ఆటల్లో పాల్గొనడం ముఖ్యమని అన్నారు. జిల్లా క్రీడల అధికారి జయదేవ్ ఆర్యా మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీలతో పాటుగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికలు చేపడుతున్నట్లు చెప్పారు. మూడు రోజులపాటు జరిగే క్రీడల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, యోగా, బాక్సింగ్, సైక్లింగ్, జోడో, చెస్, కిక్ బాక్సింగ్, బెస్‌బాల్, రెజ్లింగ్, నెట్‌బాల్, వుషో, బ్రిలియడ్స్ పోటీలు, రాష్ట్రస్థాయి ఎంపికలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, క్రీడాఅసోసియేషన్ల ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలో పాల్గొన్న బాలికలు


విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు



కొత్తిమీరకు కేరాఫ్

- ధర్మారంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు
- ఏడాది పొడవునా పంట ఉండేలా సాగు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- ఆదర్శంగా నిలుస్తున్న అన్నదాతలు

7

ఇదేమి న్యాయం.. ఇదేమి ప్రభుత్వం

- లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

6



చలి వణికిస్తున్నది

5వ పేజీ తరువాయి

తాగకపోవడంతో డీహైడ్రేషన్‌కు లోనవుతున్నారు. చలి నుంచి ఉపశమనం కోసం వెచ్చదనాన్ని ఇచ్చే ఉన్ని రగ్గులు, దుపట్లతో పాటు స్వెటర్లు, మఫ్లర్లు, మంకీక్యాపులు ధరిస్తున్నారు. చలితో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

అత్యల్ప ఉష్ణోగ్రతలు ఇలా..

సంగారెడ్డి జిల్లా కోహీర్, నల్లవల్లిలో 6.7, అల్మాయిపేట, అల్గోల్‌లో 6.8, సత్వార్ 7.3, మగ్దూంపల్లె, కంగ్టి 7.4, లక్ష్మీసాగర్, మచ్నెల్లా 7.6, చౌట్కూర్ 7.7, అన్నాసాగర్, నిజాంపేట, న్యాల్కల్ 7.8, బీహెచ్‌ఈఎల్ 7.9, సిర్గాపూర్ 8.1, జహీరాబాద్ 8.4 డిగ్రీలు

సిద్దిపేట జిల్లా

పోతారెడ్డిపేట 7.6, బేగంపేట 7.9, అంగడికిష్టాపూర్ 8.6, నంగ్‌నూర్ 8.8, హబ్షీపూర్, గౌరారం 9.1, కొండపాక 9.2, మిరుదొడ్డి, చిట్యాల 9.5, నారాయణరావుపేట 9.6, చీక్కోడ్, ములుగు, వెంకట్రావుపేట 9.7 డిగ్రీలు

మెదక్ జిల్లా

కొత్తపేట 7.8, దామరంచ, నర్సాపూర్ 7.9, బోడగట్ 8.0, శివ్వంపేట 8.2, చిప్పల్‌తుర్తి 8.3, భుజరంపేట, లింగాయిపల్లి 8.4, శివన్నూర్, టేక్మాల్ 8.6, చిట్కూల్, మిన్‌పూర్, చేగుంట 9.0, పాతూర్, లక్ష్మాపూర్ 9.1, నాగాపూర్ 9.2, సర్దన, రాజ్‌పల్లి, డి.దర్మారం, పెద్దశంకరంపేట 9.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జాగ్రత్తలు పాటించాలి

చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో అలర్జీ, అస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, బీపీ, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులకు చలి గాలి తగలకుండా చూడాలి. ఎండ వచ్చిన తర్వాతే బయటకు రావాలి.

-డాక్టర్ శివదయాల్, డీసీహెచ్ఎస్ మెదక్

వడివడిగా మల్లన్న హాల్ట్‌స్టేషన్ పనులు

- జాతరలోగా అందుబాటులోకి తీసుకువస్తామన్న రైల్వే ఉన్నతాధికారులు
- 70 శాతం మేర పూర్తయ్యాయంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎక్స్, ఫేస్‌బుక్‌లో పోస్ట్


స్టేషన్ భవనం

చేర్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌లో భాగంగా కొమురవెల్లి శివారులో చేపట్టిన మల్లన్న రైల్వేహాల్ట్‌స్టేషన్ నిర్మాణం పనులు వడివడిగా కొనసాగుతున్నాయి. ప్లాట్‌ఫాం, బుకింగ్ కార్యాలయం, వెయిటింగ్‌హాల్ భవనం పనులు శరవేగంగా చేస్తున్నారు. కొమురవెల్లి నుంచి రాజీవ్‌రహదారికి చేరుకునే దారి నుంచి సమీపంలోని హాల్ట్‌స్టేషన్ వరకు అప్రోచ్‌రోడ్డు పనులు తుదిదశకు చేరుకున్నాయి. ప్రహరీ పనులు కూడా పూర్తికావచ్చాయి.

కొమురవెల్లి మీదుగా రైల్వేలైన్ నిర్మాణం చేపట్టినప్పటికీ స్టేషన్ జాబితాలో కొమురవెల్లిని చేర్చకపోవడంతో ఎన్నో ఆందోళనలు, మరెన్నో వినతుల నడుమ హాల్ట్ స్టేషన్ నిర్మాణానికి కొన్నాళ్లక్రితం గ్రీన్‌సిగ్నల్ పడింది. దీంతో మనోహరాబాద్ నుంచి 55వ మైలురాయి, సిద్దిపేట నుంచి 21వ మైలురాయి ప్రదేశమైన కొమురవెల్లి శివారులో హాల్ట్‌స్టేషన్ నిర్మాణానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్‌తో కలిసి ఫిబ్రవరి 15న భూమిపూజ చేశారు. డిసెంబరులో నెలాఖరులో ప్రారంభం కానున్న కొమురవెల్లి మల్లన్న జాతర నాటికి స్టేషన్‌పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కానీ నెలలు గడిచినా పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహించగా.. 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు ప్రచురితం చేయడంతో స్పందించిన రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఆగస్టులో పనులకు శ్రీకారం చుట్టారు. పనుల్లో కాస్త జాప్యం నెలకొనడంతో ముందస్తు ప్రకటన మేరకు ఈనెల 29వతేదీన మల్లన్న కల్యాణానికి అందుబాటులోకి తీసుకురాలేని పరిస్థితి నెలకొంది. కానీ జనవరిలో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల సమయానికి పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకుస్తారా లేదా అన్న విషయమై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పోస్ట్

ఎప్పటికప్పుడు హాల్ట్‌స్టేషన్ పనుల పురోగతిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వాకబు చేస్తున్నారు. 70 శాతం మేర పనులు పూర్తయ్యాయంటూ రెండు రోజుల క్రితం ఆయన ఎక్స్, ఫేసుబుక్‌లో పోస్ట్ చేశారు. రికార్డు టైంలో పనులు పూర్తి కావస్తున్నాయని, మల్లన్న స్టేషన్‌తో యాత్రికులు, హైదరాబాద్ భక్తులకు మెరుగైన సదుపాయాలతో కూడిన రైల్వేకనెక్టివిటీ పెరుగుతుందని, తద్వారా ఆర్థిక ప్రగతికి దోహదం కానుందని హర్షం వెలిబుచ్చుతున్నారు.

లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి

- అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నేతలు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కూని చేసి.. రాజ్యాంగాన్ని పరిహాసనం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. లగచర్ల రైతుల అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డితో కలిసి మెదక్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వారి భూములను కాపాడుకోవడానికి ప్రయత్నించిన రైతులను దేశద్రోహుల మాదిరిగా బేడీలు వేసి తీసుకెళ్లడం దారుణమన్నారు. భూమిని కాపాడుకునేందుకు రైతులు ఆందోళన చేయకూడదా.. ఇదేమీ ప్రభుత్వం.. ఇదెక్కడి న్యాయమంటూ ప్రశ్నించారు. సొంత ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. మంత్రులకు ముఖ్యమంత్రికి మధ్య సమన్వయం కొరవడిందని.. సరైన పరిపాలన సాగించలేక పోతున్నారని విమర్శించారు. సంవత్సర కాలంలో రైతుల సమస్యలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తులం బంగారం ఇస్తానంటివి.. ఏమైందన్నారు. ఒక్క పథకమూ ప్రజలకు చేరడం లేదని విమర్శించారు. హైడ్రా పేరుతో ప్రజలను భయబ్రాంతులకు గురి చేశారన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మను తొలగించడంపై రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇప్పటికైనా లగచర్ల రైతులను విడుదల చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి తదితరులు ఉన్నారు.


మెదక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ ఆగడాలను అరికట్టండి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆగడాలను అరికట్టాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సంగారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. రైతులకు బేడీల సిగ్గు.. సిగ్గు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డీసీసీబీ ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం మాట్లాడుతూ లగచర్ల రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కర్కశకంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రైతులు కష్టం చేసుకుని బతికిన భూములను ఫార్మాసిటీ పేరుతో బలవంతంగా స్వాధీనం చేసుకోవడాన్ని అడ్డుకున్న రైతులను జైలుకు పంపించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. రైతు వ్యతిరేకి క్రాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల నుంచి లగచర్ల రైతులను విడుదల చేయాలని వివిధ రకాలుగా నిరసనలు తెలిపినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి, జిల్లా నాయకుడు డా.శ్రీహరి, మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పట్ల కర్కశత్వం

సిద్దిపేట టౌన్, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్నారని రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని మోడల్ బస్టాండ్ వద్ద లగచర్ల రైతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, పాల సాయిరాం పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణలో నైపుణ్యం సాధించి ఉపాధి పొందాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మహిళలకు అందిస్తున్న డ్రైవింగ్ శిక్షణలో నైపుణ్యం సాధించి ఉపాధి పొందాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకాంక్షించారు. సంగారెడ్డిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మంగళవారం మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా హైదరాబాద్ నగరానికి కూతవేటు దూరంలో ఉన్నదని, సంగారెడ్డి నుంచి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, హైటెక్‌సిటీ తదితర ప్రాంతాలకు ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు ప్రతి రోజు ప్రయాణిస్తుంటారని చెప్పారు. అలాంటి వారికోసం మహిళా క్యాబ్ డ్రైవర్లు ఉంటే భద్రతతో కూడిన ప్రయాణం కొనసాగిస్తామనే ధీమాతో ఉంటారని అన్నారు. ఈ సంస్థ ఇప్పటి వరకు మహిళలకు కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ లాంటి అనేక రకాల శిక్షణనందించాయని, ఇప్పుడు ఒకడుగు ముందుకు మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ అందించడం ఆనందంగా ఉన్నదన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ క్రాంతి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో జ్యోతి, సంస్థ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్న యువతులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఇదే స్ఫూర్తిని కొనసాగించండి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్విమ్మింగ్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. స్విమ్మింగ్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు అబ్దుల్ రహమాన్, అలియా ఫాతిమా, అబ్దుల్ నజీర్‌ను కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె అభినందించారు.

కొడుకు, కూతురు ఉన్నా అనాథగా వృద్ధురాలు

- చలికి వణకుతూ ఎవరైనా ఏదైనా ఇస్తే తిని జీవనం
- కౌన్సిలర్ , పోలీసుల చొరవతో కుటుంబీకులకు అప్పగింత

నర్సాపూర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆ వృద్ధురాలికి 80 ఏళ్ల వరకు ఉంటాయి.. ఆమెకు కొడుకు, కూతురు ఉన్నా వారి ఆదరణ లేక రోడ్డుపై చలికి వణుకుతూ.. ఎవరైనా ఏదైనా ఇస్తే తింటూ.. లేదంటే అర్ధాకలితోనే జీవనం సాగిస్తున్న అమానుష ఘటన ఇది. నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రోడ్డు పక్కన నర్సాపూర్ సమీపంలోని శివసాయి రైసుమిల్లు సమీపంలో నాలుగు రోజులుగా ఓ వృద్ధురాలు రోడ్డుపైనే చలికి వణుకుతూ దయనీయ పరిస్థితిలో జీవనం సాగిస్తుంది. అయితే, అటువైపు వెళ్తున్న నర్సాపూర్ బీజేపీ కౌన్సిలర్ బుచ్చేస్‌యాదవ్ గమనించి ఆ వృద్ధురాలిని పలకరించి వివరాలను అడిగి తెలుసుకున్నాడు. తనది సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోర్పట్ల గ్రామమని, పేరు శ్యామమ్మగా చెప్పింది. తనకు ఒక కొడుకు, కూతురు ఉండగా ఎవరికి వారు వారి పిల్లలతో జీవనం సాగిస్తున్నారని చెప్పింది. తనను ఇద్దరు పట్టించుకోకపోవడంతో వారు పెట్టే బాధలు భరించలేక ఇంటినుంచి వచ్చానని ఆవేద వ్యక్తం చేసింది. దీంతో ఈ విషయం బుచ్చేస్‌యాదవ్ పోలీసులకు సమాచారమివ్వగా వారు అక్కడకు చేరుకుని వృద్ధురాలు చెప్పిన వివరాల ప్రకారం కొడుకు, కూతురులకు సమాచారమిచ్చి రప్పించారు. వృద్ధురాలిని బాగా చూసుకోవాలని లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పోలీసులు హెచ్చరించారు. నాలుగు రోజులుగా చలిలో ఉండటంతో పాటు ఆరోగ్యం బాగా లేనందున సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లాని ప్రత్యేకంగా అంబులెన్సు కూడా తెప్పించి పంపించారు. కౌన్సిలర్ బుచ్చేస్‌యాదవ్, పోలీసులు చొరవచూపి వృద్ధురాలిని కుటుంబీకులకు అప్పగించినందుకు పలువురు వారిని అభినందించారు.


వృద్ధురాలిని కుటుంబీకులకు అప్పగించి ఆసుపత్రికి తరలిస్తున్న కౌన్సిలర్ బుచ్చేస్‌యాదవ్, పోలీసులు


వృద్ధురాలు శ్యామల

నారుమడికి చలి దెబ్బ

- ఉష్ణోగ్రత 12 డిగ్రీల కంటే తక్కువ నమోదైతే ప్రభావం
- ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల పది డిగ్రీల లోపు
- అక్కడక్కడ నారు ఎదగక పసుపు రంగులోకి

చిన్నకోడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇప్పుడిప్పుడే సాగు పనులు ఊపందుకుంటున్నాయి. సిద్దిపేట జిల్లా, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వరి నాట్లు వేస్తుండగా, చాలా చోట్ల తూకాలు పోశారు. కానీ, అన్నదాతలకు ఆదిలోనే కష్టాలు మొదలయ్యాయి. వారం రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వరి నారు దెబ్బతింటుంది. ఉష్ణోగ్రత 12 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువగా నమోదైనప్పుడు నారుమడులపై ప్రభావం పడుతుంది. వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పది డిగ్రీలలోపు నమోదువుతున్నాయి. చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో వరి నారు ఎర్రబడటం, ఎదుగుదల లేక పసుపు రంగులోకి మారి ఆకులపై ఎర్రని మచ్చలు ఏర్పడుతున్నాయి. చలి తీవ్రత ఇలానే కొనసాగితే వరి నారు ఎక్కువ మోతాదులో దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నారు మడులను రక్షించుకోవడానికి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. నారుమడిలో విత్తిన 10-12 రోజుల మధ్య 2 కిలోల యూరియా 4 గ్రాముల మ్యానుకోజెబ్ + కార్బన్‌డైజిమ్ మిశ్రమం వాడాలని చిన్నకోడూరు ఏవో జయంత్ కుమార్ తెలిపారు. నారు మడిపై సాయంత్రం, రాత్రివేళలో టార్పాలిన్ కవర్లు కప్పాలి. నారు పెరుగుదలకు 19:19:19 ద్రవ పోషకాలు 10 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు మడికి సాయంత్రం పెట్టిన నీటిని ఉదయం తొలగించాలి. జింక్ లోపానికి జింక్ సల్ఫేట్‌ను 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



చిన్నకోడూరు మండలం విఠలాపూర్‌లో పసుపు రంగులోకి మారుతున్న వరి నారు

భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించండి

- మంత్రులు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలను అందజేసిన నిర్వాసితులు



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

గజ్వేల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లలో భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భూనిర్వాసితులు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలను కలిసి వినతిపత్రాలను అందజేశారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ నిర్వాసితులు ములుగు మాజీ ఎంపీపీ వెంకట్రామారెడ్డి, హయతోద్దీన్, ఎర్రన్నగారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీలు కోదండరామ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతిపత్రాలను అందజేసి, తమ సమస్యలను గూర్చి వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు భూనిర్వాసితులు తెలిపారు.

గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులు..



ఎమ్మెల్సీ కోదండరామ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గౌరవెల్లి భూనిర్వాసితులు

అక్కన్నపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం హైదరాబాద్‌లో పలువురు మంత్రులు, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్, ఎమ్మెల్సీలు కోదండరామ్, తీన్మార్ మల్లన్నకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైకోర్టు స్టే ఉండగానే బలవంతంగా ఇళ్లను కూల్చివేసి, పోలీసులతో లాఠీచార్జ్ చేయించి కేసులు పెట్టి బలవంతంగా తమను పంపించి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం ప్రకారం 250 గజాల స్థలాలు, పరిహారం, ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ ఇప్పించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందులో మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, భూ నిర్వాసితులు గుర్రం రాజిరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి తదితరులున్నారు.

కేవీకేను సందర్శించిన అధికారులు

కౌడిపల్లి, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 17: మండలం పరిధి తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి(కేవీకే) 25న ఉపరాష్ట్రపతి, గవర్నర్ విచ్చేస్తున్న సందర్భంగా పలువురు అధికారులు మంగళవారం కేవీకేను సందర్శించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ మహేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, తూప్రాన్ సీఐ గంగకృష్ణ, స్థానిక ఎస్‌ఐ రంజిత్‌రెడ్డిలతో పాటు వివిధ శాఖల అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఉపరాష్ట్రపతి రానున్న సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను చేస్తున్నామన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తరలిన టీం సభ్యులు

మనోహరాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : జమ్మూ కశ్మీర్‌లో నిర్వహిస్తున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ జట్టులోని బాల, బాలికల టీం సభ్యులు మంగళవారం తరలివెళ్లారు. 20వ తేదీ నుంచి 24 వరకు జరిగే పోటీలకు తెలంగాణ నుంచి బాలురు టీం 16 మంది, బాలికల టీం 16 మంది పాల్గొననున్నారు. వారు నెలరోజుల నుంచి మనోహరాబాద్‌లోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో శిక్షణ తీసుకుంటారు. మనోహరాబాద్ నుంచి ఇద్దరు శ్రీకృతిగౌడ్, టేక్మాల్ గీతికా రెడ్డి పాల్గొన్నానున్నారు. వారికి పూర్తి ఖర్చులను మనోహరాబాద్‌కు చెందిన వెంకట్‌రెడ్డి అందజేశారు.

గోవధ నిర్మూలన ప్రతీ భారతీయుడి బాధ్యత

- బాలకృష్ణ గురుస్వామి



గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు

చేగుంట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గోరక్షణ, భూ, పర్యావరణ పరిరక్షణ ప్రతీ భారతీయుడి బాధ్యత అని.. గోమాత లేనిదే మానవ మనుగడ లేదని బాలకృష్ణ గురుస్వామి అన్నారు. గోవుల రక్షణ కోసం అఖిల భారత గో సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన గో రక్ష మహాపాదయాత్ర మంగళవారం చేగుంటకు చేరుకున్నది. కశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు బాలకృష్ణ గురుస్వామి, రిషిత్ గోమాత కలసి చేపడుతున్న మహాపాదయాత్రకు చేగుంట గురుస్వాములు రామచంద్రం, అయ్యప్ప స్వాములు ఘనస్వాగతం పలికారు. స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి రిషిత్ గోమాతకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. రెడ్డిపల్లి బైపాస్ నుంచి అయ్యప్ప స్వాములు భారీ ఎత్తున పాల్గొనగా, వడియారం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతీ రోజు 50 వేలకుపైగా గోమాతలు వధకు గురవుతున్నాయని, గోవులను రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

కొత్తిమీరకు కేరాఫ్..

ధర్మారంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు

ఏడాది పొడవునా పంట ఉండేలా సాగు
తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
ఆదర్శంగా నిలుస్తున్న అన్నదాతలు



అక్కన్నపేట మండలం ధర్మారంలో సాగుచేసిన కొతిమీర పంట

అక్కన్నపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శుభకార్యాలు, పండుగలు, పబ్బాలు, ఫంక్షన్ ఏదైనా సరే.. ఆఖరికి ఇంట్లో నాన్‌వెజ్‌తో పాటు వెజ్ కర్రీ వండినా.. ధర ఎంతైనా కొత్తిమీర ఉండాల్సిందే. ఇలాంటి కొత్తిమీరకు కేరాఫ్‌గా మారింది ఆ ఊరు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు ఎంతో కొంత విస్తీర్ణంలో కొత్తిమీర సాగు చేస్తూ లాభాలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు ధర్మారం రైతులు.



మార్కెట్‌కు తరలించేందుకు సిద్దంగా ఉన్న కొత్తిమీర

సీజన్ ఏదైనా..

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం ధర్మారం గ్రామంలో 1,156 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా 557 మంది రైతులు పంటలను పండిస్తున్నారు. వారిలో 75 శాతం మంది రైతులు కూరగాయలతో పాటు కొత్తిమీరను సాగు చేస్తారు. బోరు, బావులు ఉన్న ప్రతీ రైతు తప్పనిసరిగా ఎంతో కొంత విస్తీర్ణంలో కొత్తిమీరను పండిస్తున్నారు. సీజన్ ఏదైనా ఏడాది పొడుగునా ఈ పంట ఉండేలా చూసుకుంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తుండడంతో ధర్మారం గ్రామ రైతులు కొత్తిమీర సాగుపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

నెల రోజుల్లోనే పంట చేతికి

రైతులు సేంద్రియ పద్ధతిలో బోరు, వ్యవసాయ బావుల కింద డ్రిప్ పరికరాలు, స్ప్రింకర్ల ద్వారా నీటిని అందిస్తూ కొత్తిమీరను సాగు చేస్తున్నారు. నెల రోజుల్లోనే కొత్తిమీర పంట చేతికొస్తుంది. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25వేల వరకు పెట్టుబడి అవుతుంది. డిమాండ్‌ను బట్టి మార్కెట్‌లో ధర పలుకుతుంది. దసరా పండుగ వరకు కిలో రూ.100 పలకగా పది రోజుల క్రితం రూ.70 ఉంది. ప్రస్తుతం రూ.30 ఉందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడి పోను లాభాలు అధికంగా వస్తుండడంతో కొత్తిమీరను ఏడాది పొడవునా పండిస్తామని రైతులు పేర్కొంటున్నారు. హుస్నాబాద్ పట్టణంతో పాటు కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ మార్కెట్‌కు కొత్తిమీరను తరలిస్తారు.

ఏడాది పొడుగునా సాగు చేయొచ్చు



కొత్తిమీర పంటను ఏడాది పొడుగునా ఏ సీజన్‌లో అయినా సాగు చేయొచ్చు. తక్కువ పెట్టుబడితోనే విత్తనం విత్తగా.. నెల రోజుల్లోనే పంట చేతికొస్తుంది. డిమాండ్‌ను బట్టి ధర ఉంటుంది. ఎక్కువగానే లాభాలు వస్తున్నాయి. దీంతో 30 ఏళ్ల నుంచి కొత్తిమీర పంటను సాగు చేస్తున్నాను.

- కూస మధుకర్ రెడ్డి, ధర్మారం

ప్రభుత్వం సబ్సిడీ అందించాలి



కొత్తిమీరతో పాటు కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు డ్రిప్, స్ప్రింకర్లు అందించాలి. కొత్తిమీర సాగుతో మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి అధిక లాభాలు వస్తాయి. కూరగాయలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి.

- సిరబోయిన మొగిలి, ధర్మారం

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో క్రీడాపోటీలు

జ్యోతిని వెలిగించి ప్రారంభించిన సీజీఎం ఎస్ఎస్.ప్రసాద్



క్రీడాజ్యోతితో సీజీఎం ఎస్ఎస్.ప్రసాద్

కంది, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రాష్ట్రాల క్రీడాకారులకు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ వేదికగా మారింది. కంది మండల పరిధి ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మంగళవారం ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రాంభమయ్యాయి. మహారాష్ట్ర, చెన్నై, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని డిఫెన్స్ ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న ఉద్యోగులు తరలి వచ్చారు. హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 21 వరకు పోటీలు జరగనున్నాయి. క్రీడాపోటీలకు ముఖ్యఅతిథిగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) ఎస్ఎస్.ప్రసాద్ హాజరై, జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. జడ్పీహెచ్ఎస్, కేంద్రీయ పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అధికారులు త్రివర్ణ రంగుల బెలూన్లను గాల్లోకి ఎగురవేశారు. తొలుత వాలీబాల్ పోటీలను సీజీఎం ప్రారంభించారు.

పనితో పాటు క్రీడలు అవసరమే

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పనితో పాటు క్రీడలు అవసరమని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీజీఎం ఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. అప్పుడప్పుడు ఆటలు ఆడితేనే మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారని తెలిపారు. క్రీడలతో శారిరక ధృడత్వమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ఉత్పత్తిని పెంచేందుకు ఉద్యోగులు చేస్తున్న కృషి మరువలేనిదని కొనియాడారు. రక్షణ రంగంలో సైన్యానికి అవసరమయ్యే యుద్ధ ట్యాంకర్లు ఎన్ని కావాల్సి వచ్చినా తయారు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.



ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని సారత్ స్టేడియంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పరిశ్రమల నిర్లక్ష్యం.. కార్మికుల ప్రాణాలతో చెలగాటం

- ఒకే పరిశ్రమలో 35 రోజుల్లో ఇద్దరి మృతి
- మనోహరాబాద్ మండలంలో 200 వరకు చిన్నాపెద్ద ఫ్యాక్టరీలు
- ఇందులో ఎక్కువగా పనిచేస్తున్న వారు వలస కార్మికులే
- సేఫ్టీ చర్యలు పాటించని యాజమాన్యం

మనోహరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల నిర్లక్ష్యం.. కార్మికులకు ప్రాణసంకటంగా మారింది. మనోహరాబాద్ మండలం కేంద్రంలో సుమారు 200 పైగా చిన్న, పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. ఇతర రాష్ట్రల నుంచి వచ్చిన అనేక మంది వలస కార్మికులు తక్కువ వేతనాలకు ఈ ఫ్యాక్టరీలలో పనిచేస్తూ బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఫ్యాక్టరీల యజమానులు ఎలాంటి సేఫ్టీ లేకుండానే పనులు చేయించడంతో కార్మికులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు వదిలేస్తున్నారు. మండలంలో పరిశ్రమలలో ఎక్కువగా పనిచేస్తున్నవారు ఇతర రాష్ట్రాల వారే. తక్కువ వేతనంతో షిఫ్టుల వారీగా పది గంటలకుపైగా వారితో పనిచేయించుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదం బారిన పడి చనిపోతున్నది ఈ వలస కార్మికులే. మరణించిన సమయంలో పరిశ్రమ యజమాన్యాలు స్పందించి పరిహారం చెల్లిస్తామని హామీ ఇస్తున్న ఇప్పటివరకు ఎంతమందికి అందించారో ఒక్క పరిశ్రమ కూడా తెలియపరిచలేదు. గొడవలేకుండా ఉండేందుకు పరిహారం ప్రకటించి, తరువాత చెల్లించడం లేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

కాళ్లకల్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకుడు మృతి

జనవరిలో కాళ్లకల్‌లోని ఓ స్టీల్ పరిశ్రమలో పనిచేస్తుండగా ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అగుచోటు(20) పైపులు మీదపడ్డాడు. సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించగా ఆలోపే యువకుడు మృతిచెందాడు. వారు ముగ్గురు అన్నదమ్ములు ఆ పరిశ్రమలోనే పనిచేసుకుంటు జీవనం కొనసాగించేవారు. సరైన సేఫ్టీ పరికరాలు ఇవ్వకపోవడంతోనే అగుచోటు మృతిచెందాడని సోదరులు ఆరోపించారు. యాజమాన్యం మృతుడి కుటుంబాన్ని ఆదుకున్నది లేనిది దేవుడికే ఎరుక.


ఒకే పరిశ్రమలో ఇద్దరు..



పొట్టలో రాడ్ తగిలి మృతిచెందిన రాహుల్‌రాజ్ (ఫైల్)

ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు రంగాయపల్లి గ్రామంలో అద్దెకు ఉంటూ గ్రామ పరిధిలోని ఓ స్టీల్ పరిశ్రమలో పనిచేసేవారు. రోజులాగే పరిశ్రమలో పనిచేస్తున్న జింత్‌గౌడ్(26) స్క్రాప్ కన్వేయర్ బెల్ట్ తగిలింది. చికిత్సపొందుతూ మృతిచెందాడు. అన్న మిట్టు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మరణించిన వారి కుటుంబాన్ని పరిశ్రమ ఆదుకున్న విషయం దేవుడికే తెలియాలి. మరోఘటనలో.. రంగాయపల్లి గ్రామంలోని ఇదే పరిశ్రమలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన తండ్రి రాజ్‌నారాయణ, కుమారుడు రాహుల్‌రాజ్(24) పనిచేసేవారు. ఈనెల 15న రాహుల్‌రాజ్‌కు పరిశ్రమలో స్టీల్‌రాడ్ పొట్టలో గుచ్చుకోగా అతడిని ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆరోజు రాత్రి రాహుల్‌రాజ్ మృతిచెందాడు. రాహుల్‌రాజ్ పెళ్లై సంవత్సరం కాగా, భార్య గర్భవతి. ఒకే పరిశ్రమలో 35 రోజుల వ్యవధిలోనే ఇద్దరు వలస కార్మికులు మృతిచెందడం కలకలం సృష్టిస్తోంది.

కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారు



కార్మికుల చట్టాలను పరిశ్రమలు తుంగలో తొక్కుతున్నాయి. ప్రతీ స్టీల్ పరిశ్రమ కార్మికుల చట్టలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. ప్రమాదలు జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదు. వలస కార్మికులకు పరిశ్రమలో సేఫ్టీ ఉండడం లేదు. కార్మిక చట్టం ప్రతీ కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ ఉండాలి. పరిశ్రమలో పనిచేస్తూ మరణించిన కార్మికుల కుటుంబాల పేరిట ఇచ్చే పరిహారాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలి.

- మహేందర్‌రెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు, మెదక్ జిల్లా



క్రైం కార్నర్

గ్యాస్ లీకేజీ.. రెండు ఇళ్లు దగ్ధం

- రూ.5 లక్షల ఆస్తి నష్టం

దుబ్బాక, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్‌లీకేజై మంటలంటుకుని రెండు ఇళ్లు దగ్ధమైన సంఘటన మంగళవారం దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుజాత, రాములు తమ ఇంట్లో గ్యాస్ స్టౌవ్‌పై వంట వండేందుకు గ్యాస్ ఆన్‌చేయగా, ఒక్కసారిగా మంటలు లేచాయి. ఇంట్లోని వంట గది నుంచి మంటలు వేగంగా వ్యాపించడంతో ఇల్లు మొత్తం నిప్పంటుకుని, పక్కనున్న యాదవ రెడ్డి ఇంటికి మంటలంటుకున్నాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా, వారు వచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే రెండు ఇల్లు దగ్ధమై రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీందర్ సంఘటన స్థలాన్ని సందర్శించి, పంచనామా నిర్వహించారు.

రెండు రోజుల వ్యవధిలో రూ.40 లక్షల విలువైన ఆల్ప్రాజోలం పట్టివేత



నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

సిద్దిపేట క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజుల వ్యవధిలో సిద్దిపేట ఎక్సైజ్, పోలీసులు రూ.40 లక్షల విలువ చేసే ఆల్ప్రాజోలంను పట్టుకున్నట్లు మంగళవారం సిద్దిపేట పోలీసులు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సిద్దిపేట నుంచి కిష్టసాగర్‌కు రూ.25 లక్షల విలువ చేసే 2.5 కిలోల ఆల్ప్రాజోలంను గడ్డమీది రాజుగౌడ్ తరలిస్తుండగా సిద్దిపేట ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్, డీటీఎఫ్ సీఐ శ్రీధర్ వారి సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. 16న సిద్దిపేట కాకతీయ కాలనీలో మరుపల్లి అర్జున్ ఇంట్లో రూ.15 లక్షల విలువ చేసే 1.50 కిలోల ఆల్ప్రాజోలంను పట్టుకొన్నారు.

గడ్డపోతారం శివారు నుంచి..

జోరుగా మట్టి అక్రమ రవాణా

జిన్నారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని 27, 79 సర్వే నంబరు ప్రభుత్వ భూముల నుంచి జోరుగా మట్టి అక్రమ రవాణా కొనసాగుతున్నది. వారం రోజులుగా రాత్రివేళల్లో ప్రభుత్వ భూములు, కుంటల నుంచి జేసీబీలు, టిప్పర్ల ద్వారా మట్టిని నగర శివారు ప్రాంతాలు, స్థానిక పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు మట్టి తరలించిన ప్రాంతాలను పరిశీలించినా.. అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతూ సంపదను కొల్లగొడుతున్నట్లు స్థానికులు మండిపడుతున్నారు.

న్యూస్ బాక్స్

నారుమడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: ఏవో

మద్దూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నారుమడిలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని సలాఖ్‌పూర్‌లో రైతు దయ్యాల కనకయ్య నారుమడిని సందర్శించి పరిశీలించారు. చలితీవ్రత వల్ల నారు ఎర్రబడి ఎదుగుదల తగ్గి పసుపురంగుకు మారుతుందని, రైతులు సాయంత్రం వేళ టార్పాలిన్ కవర్ కప్పి ఉంచాలన్నారు. ప్రతిరోజు నారుకు కొత్తనీరు పెట్టాలన్నారు. నివారణకు 19-19-19 ఫర్టిలైజర్‌ను నీళ్లల్లో కలిపి పిచికారి చేయాలన్నారు.

'మాదకద్రవ్యాలకు యువత బానిస కావొద్దు'

మిరుదొడ్డి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాలకు యువత బానిస కావొద్దని మిరుదొడ్డి ఎస్‌ఐ పరశురాములు అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలో యాంటీఫర్ డ్రగ్స్ ఆర్గనైజర్ తోట కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజులు, మాజీ సర్పంచులు కిష్టయ్య, బాల్‌రాజు, మాజీ కోఆప్షన్ సభ్యుడు హైమద్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ 11వ వార్షికోత్సవం

మిరుదొడ్డి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ 11వ వార్షికోత్సవాన్ని గౌడ సంఘం నాయకులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకామాత, జమదగ్నిల కల్యాణం జరిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కత్తి కార్తీకగౌడ్ పాల్గొని పూజలు చేశారు.

క్రీడా పరికరాల విరాళం

చేర్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం కడవేరుగు గ్రామానికి చెందిన జల్లి రమేశ్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం రూ.1.20 లక్షల క్రీడా పరికరాలను విరాళంగా అందించాడు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ఇటీవల ఏర్పాటు చేయించగా.. ఎంఈవో కిష్టయ్య ప్రారంభించారు. సెక్టోరియల్ అధికారి బేతి భాస్కర్, హెచ్‌ఎంలు కాసం ఉమారాణి, చంద్రశేఖరరావు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు మద్దూరు పుష్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గురుకులం' ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ఆందోళన

చేర్యాల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని సాంఘీక, సంక్షేమ గురుకుల బాలురపాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మంగళవారం పాఠశాల ప్రధానగేటు ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

జగదేవ్‌పూర్: వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. అనంతసాగర్ గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ వరి కొయ్యలను కాలుస్తుండగా ఆయన పొలాన్ని సందర్శించి వరికొయ్యలను కాలిస్తే కలిగే ముప్పు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయంలో ప్రస్తుతం కూలీల కొరత ఉండడంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారని, వరి కోతలకు హార్వెస్టర్లను వినియోగిస్తుండడంతో గడ్డి వినియోగం తగ్గిపోతుందని చెప్పారు.

రెండు వైన్స్‌షాపులు.. 200ల బెల్ట్‌షాపులు..!

- రాయపోల్ మండలంలో ఏరులై పారుతున్న మద్యం
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



రాయపోల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలంలో బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులను నిరోధించాల్సిన సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలో 19 గ్రామపంచాయతీల్లో 25 గ్రామాలు ఉన్నాయి. మండలం ఏర్పాటు కాగానే వెంటనే రాయపోల్‌లో వైన్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ వైన్స్‌లో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తుండడంతో అంకిరెడ్డిపల్లి కేంద్రంగా మరో వైన్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో మండలంలోని గ్రామాలను రెండు వైన్స్‌ల యజమానులు బెల్టుషాపుల నిర్వహణ కోసం చెరి సగం పంచుకున్నారు. ఆయా గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించేవారు విధిగా వారికి కేటాయించిన వైన్స్‌లో మాత్రమే మందు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

పచ్చని సంసారాల్లో చిచ్చు...

మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతోంది. అందుబాటులో పుష్కలంగా మందు దొరుకుతుండడంతో పొద్దంతా పని చేసి సంపాదించిన సొమ్మును తాగుడుకు తగలేస్తున్నారు. దీంతో పలు కుటుంబాల్లో పూట గడవడం కూడా కష్టంగా మారుతున్నది. అడుగడుగునా గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తుండడంతో యువకులు పెడదారి పడుతున్నారు.

వైన్స్‌షాపుల ప్రోత్సాహంతోనే...

వైన్స్‌షాప్‌ల ప్రోత్సాహంతోనే గ్రామాల్లో మద్యం ఏరులైపారుతోంది. రిటైల్‌గా అమ్మాల్సిన మద్యాన్ని హోల్‌సేల్‌గా అమ్ముతుండడంతో పాటు అధికారులు పట్టించుకోకుండా భరోసా కల్పిస్తూ ఉండడంతో బెల్ట్‌షాపుల నిర్వాహకులు ఆటోలు, బైక్‌లు తదితర వాహనాలపై గ్రామాలకు యథేచ్ఛగా మద్యాన్ని తరలిస్తున్నారు. ఆబ్కారీశాఖ అధికారుల ప్రోత్సాహంతోనే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో పోలీసులు బెల్ట్‌షాపులు నిర్వహించేవారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. కొంతకాలం నుంచి పోలీసులు పట్టించుకోకపోవడంతో బెల్ట్‌షాపులు నిర్వాహకులకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఇప్పటికైనా గ్రామాల్లో బెల్ట్‌షాపులను కట్టడి చేయాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

సారథి లేని కారు పార్టీ



కుకునూరుపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారు పార్టీకి సారథి లేకపోవడంతో ఇటు నాయకులు, అటు కార్యకర్తల్లో అయోమయం నెలకొన్నది. తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా టీఆర్‌ఎస్‌ను స్థాపించిన కేసీఆర్ మలిదశ ఉద్యమంతో తెలంగాణను సాధించారు. పార్టీని స్థాపించినప్పటి నుంచి కొండపాక మండలం కారు పార్టీకి కంచుకోట.. కానీ రెండేళ్ల క్రితం ఏర్పడిన కుకునూరుపల్లి మండలానికి కారును నడిపించే సారథి లేకపోవడంతో కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఉమ్మడి కొండపాక మండలం నుంచి కొన్ని గ్రామాలను జగదేవ్‌పూర్ మండలంలో, మరికొన్ని గ్రామాలను కలిపి కుకునూరుపల్లి మండలాన్ని గత ప్రభుత్వం 2022 సెప్టెంబరులో ఏర్పాటు చేసింది. మండలం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. మండలం ఏర్పాటు చేసిన నాలుగునెలలలోపే కాంగ్రెస్, బీజేపీ అధిష్ఠానం తమ పార్టీ అధ్యక్షులను నియమించాయి. 2023లో అసెంబ్లీ ఎన్నికలు, 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మండలాధ్యక్షులు పార్టీని ముందుకు నడిపించారు. కానీ బీఆర్‌ఎస్ మాత్రం ఇప్పటివరకు మండలాధ్యక్షుడిని నియమించకపోవడం గమనార్హం.

అధ్యక్షుడు లేకున్నా హవా..

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు నుంచి ఐదు గ్రామాలకు ఒక ఇన్‌చార్జిని నియమించి ఎన్నికలను పూర్తిచేశారు. అటు అసెంబ్లీ, ఇటు లోక్‌సభ ఎన్నికల్లో అధ్యక్షుడు లేకపోయినా కారు పార్టీదే పైచేయి. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతుండగా వాటి అనంతరం మరో రెండునెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నది. ఈ ఎన్నికల్లో మండలాధ్యక్షుడు లేకపోతే బీఆర్‌ఎస్‌కు ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉన్నది. ఇప్పటికైనా అధ్యక్షుడిని నియమించి మరింత పార్టీ లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

దుకాణ సముదాయానికి భూమిపూజ



భూంపల్లి పీఏసీఎస్ దుకాణ సముదాయానికి భూమి పూజను చేస్తున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం దుకాణ సముదాయానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య భూమిపూజ చేసి మాట్లాడారు. రైతుల అభ్యున్నతి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రైతులకు ఎరువులను, విత్తనాలను అందుబాటులో ఉంచేవిధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి పీఏసీఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి, డైరెక్టర్లు రాజిరెడ్డి, పరశురాములు, సిబ్బంది రాజు, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల సాహిత్యంపై వర్క్‌షాప్



'భలే భలే ఆటలు' అనే సంకలన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ధూళిమిట్ట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీవాణి సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం పెందోట బాలసాహిత్యం సిద్దిపేట వారి సౌజన్యంతో బాల సాహిత్య వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ బాలసాహిత్య కవి, గేయ రచయిత పెందోట వెంకటేశ్వర్లు హాజరై విద్యార్థులకు బాలసాహిత్యంపై అవగాహన కల్పించారు. అలాగే కవితలు, గేయాలు, కథలు రాయడంలో మెళకువలు నేర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వెంకటేశ్వర్లు రచించిన 'భలే భలే ఆటలు' అనే సంకలన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య



గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో గ్రామపంచాయతీ కార్మికులతో ఎల్లయ్య

గజ్వేల్/ములుగు/అక్కన్నపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు వద్ద ధర్నాకు వెళ్తున్న గ్రామపంచాయతీ కార్మికులను మంగళవారం ఆయన గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో పరామర్శించి మాట్లాడారు. ధర్నాకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఆయనవెంట సీఐటీయూ నాయకులు వెంకటాచారీ, గ్రామపంచాయతీ కార్మికులు నర్సింలు, శ్రీనివాస్, ఎల్లం, యాదగిరి, నాగరాజు ఉన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగేష్, దశరథులు కోరారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగునెలల నుంచి వేతనాలు రావడం లేదని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న కార్మికులను అరెస్టు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ కార్మికులు నాగమణి, లావణ్య, లక్ష్మి, భారతి, నాగరాజు, యాదగిరి, నర్సింహులు పాల్గొన్నారు. అక్కన్నపేట మండలంలో గ్రామపంచాయతీ కార్మికులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందులో పంచాయతీ కార్మికులు సురేష్, సతీష్, రమేష్ ఉన్నారు.

దేశ ప్రతిష్టను దిగజార్చుతున్న మోదీ, అదానీలు



సమావేశంలో మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ, అదానీలు భాయి భాయి అంటూ దేశ ప్రతిష్టను దిగజార్చుతున్నారని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేటలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హరికృష్ణ మాట్లాడారు. అమెరికాలో గౌతమ్ అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకలు, దేశ వ్యాపార, ఆర్థిక రంగాల్లో దేశ పరువును దెబ్బతీశాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అదానీతో ములాఖత్ అయి దేశ ప్రతిష్టను దిగజారుస్తున్నారని అన్నారు. ఏఐసీసీ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎల్లం యాదవ్, నాయకులు దాస అంజన్న, ముద్దం లక్ష్మి, షాబుద్దీన్, బిక్షపతి, రాములు, మల్లేశం పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ చైర్మన్‌గా వకుళాభరణం

చేర్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్‌గా వకుళాభరణం నర్సయ్యపంతులు ఎన్నికయ్యారు. స్థానిక వాసవీగార్డెన్స్‌లో మంగళవారం బీఆర్‌ఎస్, సీపీఎం, టీడీపీ నాయకులు సమావేశమై చైర్మన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల సహకారంతో అవిశ్రాంత పోరాటం కొనసాగిస్తామని వకుళాభరణం నర్సయ్య పంతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు ముస్త్యాల బాలనర్సయ్య, సంతోశ్, సుంకరి మల్లేశం, శెట్టిపల్లి సత్తిరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు వినతి

మద్దూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మేక సంతోష్ ఆధ్వర్యంతో తహసీల్దార్ రహీంకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు మలిపెద్ది మల్లేశం, నాయకులు భాస్కర్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

కుటుంబ వివరాలు నమోదు చేయలేదని తహసీల్దార్‌కు ఫిర్యాదు

అక్కన్నపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన పెద్ది రవీందర్ తన కుటుంబం వివరాలను సర్వేలో ఎన్యుమరేటర్లు నమోదు చేయలేదని మంగళవారం తహసీల్దార్ అనంతరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నానని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక కులగణన సర్వేలో కేశవాపూర్‌లో తమ కుటుంబ వివరాలు నమోదు చేయలేదని తెలిపారు. సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు మా ఇంటికి వచ్చినప్పుడు కనీసం ఫోను కూడా చేయలేదని పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహించిన ఎన్యుమరేటర్లపై చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబ వివరాలు నమోదు చేయాలని కోరారు.

ప్రాజెక్టు రద్దయి.. పదేళ్లు

5వ పేజీ తరువాయి..

పల్లి రిజర్వాయర్‌ను మార్చి తోటపల్లి చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకోవాలని నిర్ణయించింది. తోటపల్లి ప్రాజెక్టు రద్దుకు బీజం పడింది. రైతుల నుంచి సేకరించిన 1600 ఎకరాల పైచిలుకు భూముల్లో నుంచి కాలువ నిర్మాణం కోసం కేవలం 100 ఎకరాలను మిడ్‌మానేరు కుడి కాలువ పొడిగింపు నిర్మాణానికి ప్రభుత్వం వినియోగించుకుంది. 1500 ఎకరాల పైచిలుకు భూములను తిరిగి రైతులకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అప్పటి కరీంనగర్ కలెక్టర్ నీతూ ప్రసాద్ మార్కెట్ ధర చెల్లిస్తే రైతుల భూములను వారికి ఇస్తామని ప్రకటించారు. అయితే అప్పుడు నామమాత్రపు పరిహారం తీసుకున్న రైతులు మార్కెట్ ధర ఎక్కువగా ఉండడంతో ముందుకు రాలేదు. అనంతరం జిల్లాల విభజన జరగడంతో బెజ్జంకి, కోహెడ మండలాలు సిద్దిపేట జిల్లాలోకి చేరగా చిగురుమామిడి మండలం కరీంనగర్ జిల్లాలోని కొనసాగుతుంది. అయితే ప్రాజెక్టు కోసం సేకరించిన భూములు ప్రాజెక్టు రద్దు కావడంతో ఉచితంగా తిరిగి ఇవ్వాలని రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. నాటి నుండి నేటి వరకు అప్పటి ప్రభుత్వం, ఇప్పటి ప్రభుత్వం రైతుల భూములపై ఒక స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించడం లేదు.

భూములు ఇవ్వాలని వేడుకోలు...

తోటపల్లి రిజర్వాయర్ కోసం సేకరించిన భూములను తిరిగి రైతులు పొందడానికి మార్కెట్ ధర చెల్లించాలని గత ప్రభుత్వ నిర్ణయంతో రైతుల నుండి వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపై పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన కోర్టు ఎకరానికి రూ.9.25లక్షలు చెల్లించి భూములను తీసుకోవచ్చని సూచించింది. ఈ మొత్తం చెల్లించిన రైతులకు భూములను తిరిగి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టుకు వెళ్లకుండా ఉన్న మిగతా రైతులు మాత్రం తమ భూములు ఎప్పటికైనా ప్రభుత్వం తిరిగి ఇస్తుందని ఎదురుచూస్తున్నారు. అయితే, బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ శివారులో ఒక ప్రైవేట్ సీడ్స్ కంపెనీకి మాత్రం భూములు ఇచ్చారు. రైతుల కోసం కోర్టు జారీ చేసిన ఆదేశాలనుసారంగా 124 ఎకరాల భూమికి సదరు కంపెనీ ప్రభుత్వానికి డబ్బులు చెల్లించడంతో హుస్నాబాద్ ఆర్డీవో ప్రైవేట్ సీడ్స్ కంపెనీకి 2021లో రిజిస్ట్రేషన్ చేశారు. ఇదే సమయంలో డబ్బు చెల్లించేందుకు సిద్ధమైన కొంతమంది రైతులకు మాత్రం అప్పటి ప్రభుత్వ హయాంలో అధికారులు మొండిచేయ్యి చూపించారు. ఆ తర్వాత రైతులు ఆయా భూముల్లో సాగు చేసుకుంటున్నారు. భూములున్నా కూడా రైతుబంధు, రైతుబీమా వర్తించక ప్రభుత్వ రికార్డుల్లో లేక భూములపై బ్యాంకులు రుణాలు ఇవ్వక అవసరాలకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ భూములు తిరిగి ఇవ్వాలని తోటపల్లి ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులు వేడుకుంటున్నారు.

మా భూములు మాకు తిరిగి ఇవ్వాలి



తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసమని గాగిల్లాపూర్ శివారులోని మా ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుంది. ప్రాజెక్టు రద్దయి పదేళ్లయినా మా భూములను మాకు తిరిగివ్వడం లేదు. జీవనాధారమైన మా భూములను ప్రాజెక్టు కోసం ఇచ్చాం. ఇప్పటి వరకు రైతుబంధు పడలేదు. రెవెన్యూ రికార్డుల్లో ప్రాజెక్టు కింద భూమి పోయినట్టు చూపిస్తుంది మా భూములు మాకు తిరిగి ఇవ్వాలి.

- సురుకొంటి రాజిరెడ్డి, రైతు, గాగిల్లాపూర్

బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు



తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం భూసేకరణలో మాకు ఉన్న రెండెకరాల భూమిపోయింది. అప్పుడు నామమాత్రమే పరిహారం అందించి ప్రభుత్వం భూమిని తీసుకుంది. ప్రాజెక్టు రద్దైనప్పటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ ఆధీనంలోనే భూమి ఉంది. పెట్టుబడి అవసరాల కోసం బ్యాంకుకు వెళ్లి రుణం తీసుకుందామంటే భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉందని బ్యాంక్ అధికారులు రుణం ఇవ్వడం లేదు. రైతుబీమా వర్తించక బ్యాంకు రుణాలు ఇవ్వక ఇబ్బందులు పడుతున్నాం.

-బద్దం శ్రీనివాస్‌రెడ్డి, రైతు, గాగిల్లాపూర్

కాంగ్రెస్‌ది చేతల ప్రభుత్వం

- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్



గజ్వేల్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న సర్దార్‌ఖాన్

గజ్వేల్/నంగునూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 6, 7, 12వ వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలతో కలిసి సర్వేను పరిశీలించి మాట్లాడారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ గృహాలకు రూ.5 లక్షలు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు, గాడిపల్లి శ్రీనివాస్, నాగరాజు నేత, అజ్జర్, చెప్యాల శేఖర్, గాజుల శ్రీనివాస్, సురేశ్, అరుణ్, కృష్ణ, మహంకాళీ చంద్రం తదితరులున్నారు. అలాగే నంగునూరులో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.చంద్రకళ, ఇందిరమ్మ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

'కార్యకర్తల కుటుంబాలకు బీజేపీ అండ'

రాయపోల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తల కుటుంబాలకు ఎలాంటి ఆపద వచ్చినా పార్టీ అండగా ఉంటుందని బీజేపీ మండలాధ్యక్షుడు రాజాగౌడ్ పేర్కొన్నారు. రాయపోల్‌లో అనారోగ్యంతో మృతిచెందిన బీజేపీ కార్యకర్త బ్యాగరి రమేష్ కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన మాల రాజలింగం కూడా రమేష్ కుటుంబానికి రూ.5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి, నాయకులు రాజు, సుకేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేస్తాం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాలేష్‌గౌడ్

దుబ్బాక/వర్గల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : రానున్న దుబ్బాక మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగరవేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాలేష్‌గౌడ్ ధీమావ్యక్తం చేశారు. మంగళవారం దుబ్బాక మున్సిపాలిటి పరిధిలో 38వ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా వంశీని ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్ యాదవ్, సుంకోజీ ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే బీజేపీ వర్గల్ మండలాధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని సీతారాంపల్లి, అంబర్‌పేట గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీలను నియమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఎల్లు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి పంజాల వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా స్వామి

దుబ్బాక, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ దుబ్బాక మండలాధ్యక్షుడిగా ఇస్తారిగల్ల స్వామిని మంగళవారం సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్‌మాదిగ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధికార ప్రతినిధిగా బాబు, ఉపాధ్యక్షుడిగా నవీన్, రమేష్, ప్రధాన కార్యదర్శిగా సాగర్, కార్యదర్శుగా శేఖర్, మహేష్, కోశాధికారిగా అనిల్, ప్రచార కార్యదర్శులుగా నరేష్, శేషకుమార్, కార్యవర్గసభ్యులుగా కరుణాకర్, ప్రశాంత్, ఉదేశ్, నవీన్, రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఎంఎస్పీ అధ్యక్షుడిగా బద్రి, ఉపాధ్యక్షుడిగా విజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బాబుజగ్జీవన్‌రామ్ సంఘం అధ్యక్షుడు చెక్కపల్లి రాజమల్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్లంమాదిగ, రామచంద్రంమాదిగ, బాబు, యాదగిరి పాల్గొన్నారు.

'విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'

వర్గల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం వర్గల్ అధ్యక్షుడు ఎంఏ.జలీల్ పేర్కొన్నారు. వర్గల్ మండల కేంద్రంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ పెన్షనర్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జలీల్‌తో పాటు అచ్చమాంబలను తోటి విశ్రాంత ఉద్యోగులు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పొద్దటూరి ప్రకాశం, పండరి పాల్గొన్నారు.

గుర్తు తెలియని జంతువు దాడిలో దూడ మృతి

చిన్నకోడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని జంతువు దాడిలో దూడ మృతి చెందిన సంఘటన చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో మంగళవారం జరిగింది. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బుచ్చయ్య వివరాల ప్రకారం.. చంద్లాపూర్‌కు చెందిన దేవుని నర్సయ్య రెండేళ్ల వయస్సు గల దూడతో పాటు మరికొన్ని పశువులను రోజు మాదిరిగానే సోమవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద పశువుల పాకలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూసేసరికి దూడకు తీవ్రగాయాలై ఉన్నాయి. సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బుచ్చయ్య, బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల ఆనవాళ్ల కోసం పరిశీలించగా ఎలాంటి పాద ముద్రలు లభించలేదు. దూడపై ఏదైనా గుర్తు తెలియని జంతువు దాడిచేసి ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. అనంతరం జంతువు దాడిలో గాయపడిన దూడ మృతిచెందింది. మృతిచెందిన దూడ విలువ సుమారు రూ.10 వేల వరకు ఉంటుందని బాధిత రైతు నర్సయ్య తెలిపారు.



గజ్వేల్ పట్టణంలో అంబేద్కర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



బెజ్జంకి మండలంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రైతులపై అక్రమ కేసులు దుర్మార్గం

లగచర్ల రైతులపై అక్రమ కేసులు దుర్మార్గమని బీఆర్‌ఎస్ నేతలు అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు లగచర్ల రైతులపై ప్రభుత్వ నిర్బంధకాండను నిరసిస్తూ సిద్దిపేట జిల్లాలోని ఆయా మండలాల్లో నాయకులు నిరసన తెలిపారు.

- న్యూస్ నెట్‌వర్క్, డిసెంబరు 17